మానవాళి పాలిట ముప్పు

రోజురోజుకీ పెరుగుతున్న పాలిథిన్ వినియోగం

- పర్యావరణానికి తీవ్ర హానికరం
- ఫొటోలకే పరిమితమైన 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'
- నిషేధంపై అవగాహన కల్పించని అధికారులు



మాదలలో రహదారి వెంబడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ముప్పాళ్ళ: టిఫిన్లు, కూరగాయలు, పండ్లు, కిరాణా సరుకులు, పూలు... ఇలా ఒక్కటేమిటి ప్రతి వస్తువునూ ప్లాస్టిక్ కవర్లలోనే ఇళ్లకు తీసుకొస్తున్నాం. ఇక వేడి వేడి టీ, కాఫీ, పాలు, చల్లటి పానీయాలు సైతం కవర్లనే పార్శిల్ తెచ్చుకుంటూ రోగాలను మోసుకొస్తున్నాం. ఇలా ఒక చిన్న వెసులుబాటు.. నేడు ఒక అలవాటుగా మారి... మానవ మనుగడకు ప్రమాదకరంగా తయారైంది. సరుకుల రవాణాకు సులువుగా ఉండే పాలిథీన్ కవర్లు నేడు ప్రజల నిత్యావసరాల్లో అత్యంత కీలకమైపోయాయి. అలా వచ్చిన ప్లాస్టిక్ ప్రజలకు, పర్యావరణానికి పెనుముప్పని తెలిసినా మానుకోలేని స్థితికి చేరుకోవాల్సిన పరిస్థితి.

విచ్చలవిడిగా వినియోగం

పాలిథిన్ కవర్ల వినియోగాన్ని 2011లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. మొదట కార్పొరేషన్, మున్సిపాలిటీ, తర్వాత గ్రామపంచాయతీ పరిధిలో అమలు చేయాలని సూచించింది. దుకాణాల్లో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జనపనార, కాగితం కవర్లను వాడాలని ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో పాలిథిన్ కవర్లను నిషేధించామని మండల అధికారులు సైతం ప్రకటించారు. అయితే నిషేధం కేవలం ప్రకటనలకే పరిమితమవడంతో వినియోగం విచ్చలవిడిగా సాగుతుంది. వాడిన తర్వాత ఎక్కడిపడితే అక్కడ పారవేయడం వల్ల గ్రామాలు ప్లాస్టిక్ నిలయాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలు ప్రకటనలకే పరిమితంగా మారుతున్నాయే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు.

పొంచి ఉన్న ప్రమాదాలు...

- పాలిథిన్ మట్టిలో కలవకపోవడంతో నీరు, మట్టి కాలుష్యమై పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమిస్తుంది. దీంతో ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.
- వాన నీరు త్వరగా భూమిలోకి ఇంకిపోకుండా అడ్డుపడతాయి
- పాలిథిన్ కణాలు మట్టి సారాన్ని తగ్గిస్తాయి.
- భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతాయి.
- కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీటి ప్రవాహాన్ని అడ్డుకుంటాయి. దీంతో ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచి స్తంభించిపోయి, దోమలు ఉత్పత్తి విపరీతంగా జరుగుతుంది. తద్వారా వ్యాధులు ప్రబలతాయి.
- మూగజీవాలు కవర్లలో ఉన్న వ్యర్థ పదార్థాలను చూసి కవర్లతో పాటు తినేయడం వలన వాటి కడుపులో పేగులకు చుట్టుకొని ప్రాణాలు కోల్పోతాయి.

ఫొటోలకు ఫోజులే..



ముప్పాళ్ళలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

కూటమి ప్రభుత్వం ప్రతి నెలలో మూడో శనివారం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. అయితే ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా ర్యాలీ నిర్వహించి ఫొటోలు తీసుకొని ముగిస్తున్నారు. అయితే ప్లాస్టిక్ వినియోగం పై ఏ ఒక్క అధికారి ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. దీంతో ఈ కార్యక్రమం అధికారుల మెప్పు కోసమే నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విస్తృతంగా తనిఖీలు చేపట్టాలి



ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. వాడకం వలన కలిగే అనర్థాలను వివరిస్తే కొంత మార్పు తీసుకురావచ్చు. దుకాణాల్లో విస్తృతంగా తనిఖీ నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారిపై కేసులు నమోదు చేయాలి. అధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప వాడకం తగ్గే అవకాశం లేదు.

–మధిర రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్, చాగంటివారిపాలెం

ప్రజల సహకారంతోనే సాధ్యం..



పాలిథిన్ కవర్ల నిషేధంలో ప్రజల సహకారం ఎంతో అవసరం. అందరిలోను మార్పు రావాలి. పాలిథిన్ వినియోగం వలన పర్యావరణానికి హాని కలుగుతుంది.

–పి.రత్నం, ఎంపీడీఓ, ముప్పాళ్ళ

పాలిథిన్ వాడకంతో క్యాన్సర్ ముప్పు



పాలిథిన్ వాడటం వలన క్యాన్సర్ బారిన పడాల్సి వస్తుంది. వేడి ఆహార పదార్థాలు ప్యాక్ చేయరాదు. దీంతో ప్లాస్టిక్‌లోని రసాయనాలు మనిషి శరీరంలోకి చేరతాయి. దీంతో కొత్తకొత్త వ్యాధులు వస్తాయి. ఇంటి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులు తీసుకెళ్తే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ని నిషేధించవచ్చు.

–పి.రమాదేవి, పీహెచ్‌సీ వైద్యురాలు

క్లుప్తంగా

గంగమ్మ తల్లికి ఆషాఢం సారె



సత్తెనపల్లి: పట్టణంలోని దోబీఘాట్(రజకుల) కాలనీలో గల గంగమ్మతల్లి అమ్మవారికి ఆషాఢ సారెను శనివారం భక్తులు సమర్పించారు. 35 సంవత్సరాల క్రితం వెలిసిన గంగమ్మ తల్లిని రజకులు తమ కులదైవంగా పూజిస్తున్నారు. ధోబీ ఘాట్‌లో ఉన్నటువంటి సుమారు 500 కుటుంబాలవారు గంగమ్మ తల్లికి ఆషాఢ సార రూపంలో ప్రతి ఇంటి నుంచి ఏదో ఒక ప్రసాదం చేసుకొని అంగరంగ వైభవంగా ఊరేగింపుగా బయలుదేరి మధ్యాహ్నానికి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన ముత్తయిదులవుకు అన్న సంతర్పణ, ఆషాఢ సారెను అందించారు. దోబీ ఘాట్ కమిటీ సభ్యులు, దోబీ ఘాట్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా జరీనా



క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా షేక్ జరీనాను స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నామినేట్ చేసినట్లు ఆ పార్టీ కార్యాలయవర్గాలు శనివారం తెలిపాయి. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి క్రోసూరు మార్కెట్‌యార్డు పాలకవర్గ చైర్‌పర్సన్‌ను నియమించటం ఇదే ప్రథమం. జరీనా అమరావతికి చెందిన టీడీపీ నాయకుడు షేక్ జానీ సతీమణి. త్వరలో పాలకవర్గం సభ్యులందరితో పదవీ బాధ్యతలు చేపట్టేందుకు మార్కెట్‌కమిటీ అధికారికంగా ఏర్పాట్లు చేయనుంది..

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



నకరికల్లు: నూరుశాతం రాయితీపై పంపిణీ చేస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. జాతీయ ఆహార భద్రత, పోషకాహార పథకం కింద నూరుశాతం రాయితీపై కంది, మినుము విత్తనాలను రైతులకు శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నకరికల్లు మండలానికి కందిలో ఎల్ఆర్‌జీ 52 రకం 100 కిట్లు, మినుములో వీబీఎన్–8 రకం 56 కిట్లు, టీబీజీ–104 రకం 98 కిట్లతో పాటు వరిలో మినీ కిట్లు వ్యవసాయశాఖ ద్వారా రైతులకు పంపిణీ చేశామన్నారు. మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, డీఎల్‌డీఓ హరిప్రసాద్, ఎంపీడీఓ జి.కాశయ్య, ఏఓ కె.దేవదాసు, డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, దరువూరి నాగేశ్వరరావు, సాగి శ్రీనివాసరావు, పూజల వెంకట కోటయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం



సత్తెనపల్లి: సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజినీరింగ్ కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించారు. కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ జనాభాకు తగ్గట్టుగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్మిక సంఘ నాయకులు, మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉన్నారు.

మూడు చోట్ల క్లస్టర్ సమావేశాలు

రొంపిచర్ల: మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు, జెడ్పీహెచ హైస్కూల్‌లలో వి.రెడ్డిపాలెం మోడల్ స్కూల్‌లో శనివారం క్లస్టర్ సమావేశాలు నిర్వహించారు. జూలై నెలలో పూర్తి చేయాల్సిన సిలబస్‌పై తరగతుల వారీగా సమీక్షించారు. విద్యాబోధన చేయడంలో మెళుకువలు, విద్యార్థులను అన్ని విషయాల్లో చురుకుగా ఉంచడంలో పాటించవలసిన జాగ్రత్తలు, పాఠశాలల్లో వసతులు, అభివృద్ధి, పారిశుద్ధ్యంపై చర్చించారు. ఈ కార్యక్రమాలను ఎంఈవో డి. బ్రహ్మేశ్వరరావు పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె. బి.యం. సుభాని, కె. శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 వరకు దూరవిద్య ప్రవేశాలకు దరఖాస్తు చేయొచ్చు

దూరవిద్య మండల కో–ఆర్డినేటర్ చిల్కా సురేష్

క్రోసూరు: ఏపీ ఓపెన్ సొసైటీ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించే దూరవిద్య 10వ తరగతి, ఇంటర్‌లలో ప్రవేశానికి ఈనెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని దూరవిద్య మండల కో–ఆర్డినేటర్ చిల్కా సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 ఏళ్లు నిండి చదువు మధ్యలో నిలిపివేసిన అభ్యర్థులు 10వ తరగతిలో , 15 సంవత్సరాలు నిండినవారు ఇంటర్‌లో ప్రవేశం పొందవచ్చునని తెలిపారు. రెగ్యులర్ 10వ తరగతి, ఇంటర్ ఫెయిలైన వారు చేరవచ్చునని అన్నారు. 2025–26 సంవత్సరానికి ఈనెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 8125090281 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

అచ్చంపేట తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



అచ్చంపేట: అచ్చంపేట తహసీల్దార్‌గా కుంభా శ్రీనివాసరావు శనివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏపీ సచివాలయంలో సీఆర్డీఏలో తహసీల్దార్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బి.సరోజ సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో పరిపాలనాధికారిగా వెళ్లారు.

సాధనా సామర్థ్యాలతో ఉత్తమ ఫలితాలు

నాదెండ్ల: విద్యార్థులకు సాధనా సామర్థ్యాల ద్వారా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించి ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో చంద్రకళ చెప్పారు. మండలంలో ఐదు క్లస్టర్లు గణపవరం, నాదెండ్ల, సాతులూరు, చిరుమామిళ్ళ, ఎండుగుం పాలెంలలో కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. శనివారం సాతులూరులో జరిగిన కాంప్లెక్స్ సమావేశంలో డీఈవో చంద్రకళ హాజరై ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు.

స్మృతివనానికి స్థలం కేటాయింపు హర్షణీయం



గాంధీచౌక్‌లో జాతీయ నేతల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘాల నాయకులు

సత్తెనపల్లి: అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనానికి ప్రభుత్వం స్థలం కేటాయించటం హర్షణీయమని సత్తెనపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం అన్నారు. పట్టణ ఆర్య వైశ్య చలివేంద్ర సంఘం, పట్టణ ఆర్య వైశ్య సంఘం, పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్‌లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి శనివారం క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. అనంతరం అక్కడ ఉన్న మిగిలిన జాతీయ నాయకుల విగ్రహాలకు పూల మాలలు వేశారు. కొల్లిపర కాశీవిశ్వనాథం మాట్లాడుతూ ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములుకి అరుదైన గౌరవం ఇవ్వటం ఆనందదాయకమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల నాయకులు కందకట్ల శంకర్, బచ్చు వెంకటేశ్వర్లు, అన్నం బాల సుబ్రమణ్యం, చల్లంచర్ల కళ్యాణ్, జవ్వాజి రామమోహనరావు, పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ, కాపుగంటి రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని అడ్డుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు



పాత బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు

సత్తెనపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి అదానీ కంపెనీ సిబ్బంది వస్తే ఆయా ప్రాంతాల ప్రజలంతా ఐక్యంగా అడ్డుకోవాలని, మీకు సీపీఎం అండగా ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు ప్రజలకు పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పాత బస్టాండ్ సెంటర్లో సీపీఎం బృందంతో శనివారం ఆయన ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాబురావు మహిళల వద్ద ఉన్న పెరిగిన విద్యుత్ బిల్లులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో వందల్లో వచ్చే విద్యుత్ బిల్లులు ఇప్పుడు వేలల్లో వస్తున్నాయని మహిళలు ఆయనతో వాపోయారు. గత ఎన్నికలలో కూటమి పార్టీలు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అదానీ కంపెనీ తో ఒప్పందం కుదుర్చుకొని స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తుందన్నారు. ఈ పాపంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ భాగస్వాములేనన్నారు. ప్రజల సొమ్మును కార్పొరేట్లకు దోచి పెట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను తిప్పికొట్టేందుకు సీపీఎం నిర్వహించే ప్రజా ఉద్యమాలలో మీరంతా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శి వర్గ స భ్యులు ఏబీఎస్ గోపాలరావు, వై రాధాకృష్ణ, న్యా యవాది పిన్నమనేని పాములయ్య, పట్టణ కార్యదర్శి డి విమల, మండల కార్యదర్శి పి.మహేష్, జి.మల్లేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగిస్తాం

తహసీల్దార్ రమేష్‌కుమార్



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్

నూజెండ్ల: మండల పరిధిలోని ఐనవోలు పంచాయితీ యోగిరెడ్డిపాలెం గ్రామంలో వివాదాస్పద భూమిని తహసీల్దార్ రమేష్ కుమార్ శనివారం పరిశీలించారు. గ్రామంలోని ఉన్న కుంట పోరంబోకు భూమిని సర్వే చేసి ఆక్రమణలు తొలిగించాలని తహసీల్దార్‌కు ఇటీవల గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదేశాలతో సర్వేయర్ చండీరాణి భూమిని సర్వే చేసి సర్వే నెం 105 ఎ లో 3.15 సెంట్లు కుంట పోరంబోకుగా తేల్చారు. మిగిలిన 105 1బి లో 87 సెంట్లు వేరొకరి ఆధీనంలో ఉందని నిర్ధారించారు. కుంట పోరంబోకు భూమి సబ్ డివిజన్ జరగలేదని తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఆక్రమణలు చేశారని గ్రామస్తులు వివరించారు. సమగ్ర విచారణ చేసి చర్యలు చేపడతామని తహసీల్దార్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

బీసీలకు రక్షణ చట్టం తీసుకురావాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు బీసీలకు రక్షణ చట్టం తేవాలని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వెంటనే కల్పించాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. శనివారం మున్సిపల్ అతిథి గృహంలో మీడియాతో మాట్లాడారు. జనగణనలో సమగ్ర కులగణనను కేంద్రం చేపడుతున్నందున ముందుగా విధివిధానాలు బహిర్గతంచేసి జాతీయస్థాయిలో జనగణన అనంతరం ఎస్సీ–ఎస్టీల మాదిరిగానే ఓబీసీలకు కూడా జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థలలో 34 శాతం, చట్టసభలలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేలా కూటమి సర్కారు ఎన్నికల వాగ్దానం చేసిందన్నారు. కులగణన తర్వాత మాత్రం జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు పెంచేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిచేయాలని కోరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, యువజన అధ్యక్షులు సుతారం విశ్వేశ్వరరావు, రొంపిచెర్ల మండల అధ్యక్షులు గాలి సాంబశివరావు పాల్గొన్నారు.

పాలిథిన్ రహిత సమాజానికి కృషి చేద్దాం



సత్తెనపల్లిలో ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు, మహిళలు

సత్తెనపల్లి: స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి పట్టణాన్ని పాలిథిన్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజా సహకారంతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర .. స్వచ్ఛాంధ్ర అనే కార్యక్రమం ప్రతి నెల మూడో శనివారం నిర్వహించాల్సిందిగా ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో శనివారం ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి తాలూకా సెంటర్ వద్ద మానవహారం చేపట్టి స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్లకార్డులతో నినదించారు మున్సిపల్ డీఈ మధుసూదన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, మెప్మా టీఎంసీ ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో..

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీ లలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కే.నగేష్, ఎంపీడీఓ పి.రత్నం, పీహెచ్‌సీ వైద్యురాలు రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేష్, ఏఓ శ్రీనివాసరావు, ఆర్ఐ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్‌లు పీటర్ డేమియన్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, ఎమ్మార్పీ బ్రహ్మనందం, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం: ప్లాస్టిక్ వాడకం మానవాళికి హానికరమని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ తెలిపారు. మండలకేంద్రంలోని రాజుపాలెం పురవీధుల్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకం నిరోధించాలని అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎంపీడీఓ పాల్గొని రహదారికి ఇరువైపుల ఉన్న చిరు దుకాణాల దారులకు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి, వాటిని దుకాణాలలో అమ్మరాదని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ప్లాస్టిక్ వద్దు బట్ట సంచులే ముద్దు అంటూ నినాదాలు చేవారు. సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఈఓపీఆర్డీ పగడాల ముక్కంటి, ఎంఈఓ–1 మల్లిఖార్జునశర్మ, ఎంఈఓ–2 నరసింహారావు, డీటీ జానీబాషా, కేదారి రమేష్, లైబ్రేరియన్ కేఎస్ఎస్ ప్రసాద్, ఎస్‌కె రజాక్, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో..

సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా యార్డ్ ప్రాంగణంలోని పరిసరాలను పరిశుభ్రపరిచారు. ఏఎంసీ చైర్‌పర్సన్ కోమటినేని శోభా రాణి, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, పలువురు డైరెక్టర్లు, యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

నకరికల్లులో...

నకరికల్లు: సంపూర్ణ పారిశుద్ధ్య కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని డీఎల్‌డీఓ రాజగోపాల్ అన్నారు. ప్రతినెలా 3వ శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా నకరికల్లులోని డంపింగ్‌యార్డును శనివారం పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీకేంద్రంలో సిద్ధం చేసిన వర్మీకంపోస్టు ఎరువును పరిశీలించారు. మొక్కలను నాటారు. స్థానిక పాత పంచాయతీ కార్యాలయం నుంచి నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ జి.కాశయ్య, డిప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, గ్రీన్ అంబాసిడర్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట: ప్లాస్టిక్ లగేజీ కవర్లను, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను నిషేధించాలని, ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని ఎంపీడీఓ కోయా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అచ్చంపేట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అచ్చంపేటలో ర్యాలి నిర్వహించారు. అచ్చంపేట సర్పంచ్ షేక్ జాని, పంచాయతీ కార్యదర్శి పంతులూ నాయక్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులవి అసందర్భ ప్రేలాపనలు

చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులవి స్థాయికి మించిన ప్రేలాపనలని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. విమర్శకు ప్రతి విమర్శ చేసేటప్పుడు వారిస్థాయి గుర్తుంచుకోవాలని సూచించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న మాజీ మంత్రి విడదల రజిని నివాసంలో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు జరిగిన మేలు గురించి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు వివరించటం జరిగిందన్నారు. అదే క్రమంలో ఏడాదిగా టీడీపీ పాలనలో ప్రజలకు జరిగిన మోసాన్ని బాధ్యతగల ప్రతిపక్షంగా విమర్శించటం జరిగిందన్నారు. దీనికి సంబంధించి వారిస్థాయి ఏమిటో వారికి కూడా తెలియని వారితో టీడీపీ అధినాయకత్వం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి స్థాయి మరిచి విమర్శలకు పాల్పడటం నీచమన్నారు. 100 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణంతో పాటు ఆసుపత్రి చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి ఎప్పుడో మాజీ మంత్రి విడదల రజిని శంకుస్థాపన చేశారని వివరించారు. ఇప్పుడు తిరిగి రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చేయడం హాస్యాస్పదమన్నారు.

చిలకలూరిపేటకు బైపాస్ నిర్మాణం కేంద్ర పరిధిలో ఉంటుందని టీడీపీ వారికి తెలియకపోవడం శోచనీయమన్నారు. బైపాస్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం చేపడితే, నిర్మాణానికి అవసరమైన భూసేకరణ జగనన్న ప్రభుత్వంలో మాజీ మంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో చేసి రైతులకు రూ. 250 కోట్లు పరిహారంగా చెల్లించి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కరోనా కరణంగా పనుల్లో కొంత జాప్యం జరిగడం, పనులు పూర్తి అయ్యేనాటికి ఎన్నికల కోడ్ రావడంతో బైపాస్ రోడ్డు ప్రారంభానికి ఆలస్యం జరిగిందన్నారు. బైపాస్ కూడా తమ హయాంలో జరిగినట్లు చెప్పుకోవడం టీడీపీ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శమన్నారు. వైఎస్సార్ సీపీ టికెట్‌పై గెలిచి టీడీపీలోకి ఫిరాయించిన పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి లాంటి వాళ్లది మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ మంత్రి విడదల రజినిని విమర్శించే స్థాయి కాదన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన మంచిని తమ ప్రభుత్వంలో జరిగినట్లు చెప్పుకోవడం కాదని వీలైతే ప్రజలకు గట్టిమేలు చేసి చెప్పుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి, చిలకలూరిపేట ఎంపీపీ దేవినేని శంకరరావు, యడ్లపాడు మండల పార్టీ అధ్యక్షుడు వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏకాంబరపు సునీత, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పాల ప్రభుదాస్ నాయుడు, జిల్లా నాయకులు సింగారెడ్డి కోటిరెడ్డి, మద్దూరి కోటిరెడ్డి, సయ్యద్ జమీర్, గోపతోటి జాన్, తాళ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చేతిరాత శిక్షణా తరగతులు



చిలకలూరిపేటటౌన్: పట్టణంలోని సుబ్బయ్యతోటలోని వికాస్ విద్యసంస్థలో ప్రముఖ క్యాలిగ్రఫీ నిపుణులు వై మల్లికార్జునరావు ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక కర్సివ్ హ్యాండ్ రైటింగ్ వర్క్‌షాప్ శనివారం ముగిసింది. 6 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, అక్షరాల మధ్య బంధాన్ని నిర్మించి రాయడం వల్ల సమయాన్ని ఎలా ఆదా చేసుకోవచ్చో విద్యార్థులకు వివరించారు. చేతివ్రాత క్రమబద్ధత విద్యార్థుల్లో అంకితభావాన్ని పెంపొందించడానికి కీలకమని తెలిపారు. విద్యార్థుల మౌలిక నైపుణ్యాల పెంపు కోసం వివిధ రంగాల్లో నిపుణులతో తరచూ శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామని వికాస్ డైరెక్టర్లు దండా పవన్ కుమార్, రోజశ్రీలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్స్ కల్పన, శ్యాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.